పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు

ఎమ్మెల్యే ఆళ్ల నాని





సంక్షేమ పథకాలపై మహిళను ఆరా తీస్తున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్, లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ళనాని, మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్ : రాష్ట్రంలోని ప్రతి పేదవాడి కుటుంబంలోనూ వెలుగులు నింపాలనే ఉన్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 107వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక 13వ డివిజన్ ఇందిరాకాలనీ వెంకన్న చెరువు ప్రాంతం నుంచి నాని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి అవ్వా.. పింఛన్ అందుతుందా?. సాంకేతిక లోపంతో పథకానికి దూరమైతే వాటిని పరిష్కరించి అర్హులందరికీ లబ్ధి చేకూర్చుతామని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ మేలు చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన చేస్తుంటే రాష్ట్రంలో ప్రతిపక్షాలు నీచమైన రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. కరోనా వంటి కష్టకాలంలోనూ ప్రజలకు అండగా ఉంటూ వారి కుటుంబాలు ఇబ్బందులు పడకుండా సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. ఏలూరు నియోజకవర్గంలో 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని, తొలిదశ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. విలీన గ్రామాల్లో సైతం రక్షిత తాగునీటి సరఫరాకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. నాడు – నేడులో స్కూళ్లను అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. తొలుత ఎమ్మెల్యే నానికి కార్పొరేటర్ నిడికొండ అన్నపూర్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు నిడికొండ నరేంద్ర ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్ గురునాథ్, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, తుమరాడ స్రవంతి, పొలిమేర దాసు, సుంకర చంద్రశేఖర్, కలవకొల్లు సాంబ, తంగెళ్ల రాము, దేవరకొండ శ్రీనివాస్, సబ్బన శ్రీనివాస్, లీగల్‌సెల్ నాయకులు దొంగ రామాంజనేయులు, ప్రత్తిపాటి తంబి, పార్టీ నాయకులు పొలిమేర హరికృష్ణ, సేవాదళ్ నాయకులు యల్లాపు మోజెస్, విద్యార్థి నాయకులు వైఎస్వీ శివరావు, పిట్టా ధనుంజయ్, లూటుకుర్తి శుభాష్, భోగిశెట్టి పార్వతి, లక్కోజు గోపి, తదితరులు ఉన్నారు.

జగనన్నకు అండగా.. నాన్ని అన్నకు తోడుగా

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలబడాలని, ప్రజలకు మంచి జరగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే నాని అన్నారు. 13వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సేవాదళ్, యువజన విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన స్టిక్కర్లు, పాకెట్ బ్యాడ్జీలను ఆయన విడుదల చేశారు. జగనన్నకు అండగా ఉందాం... నాన్ని అన్నకు తోడుగా అంటూ ప్రత్యేక నినాదంతో యువజన నాయకులంతా వీటిని ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రజలంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై సంతృప్తితో ఉన్నారని, పేదవర్గాలను ఆదుకున్న ఏకైక ప్రభుత్వం మనదే అని అన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



కాట్లంపూడిలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్: ఏలూరు మండలం మాల్కాపురం, కాట్లంపూడి గ్రామాల్లో గురువారం మన భూమి, మన దేశం కార్యక్రమం నిర్వహించారు. మాల్కాపురంలో ఏర్పాటుచేసిన అమరవీరులకు సిహ్నంగా ఏర్పాటుచేసిన స్థూపాన్ని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు ఆవిష్కరించి మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు పూర్తి కావస్తున్నందున ప్రజలు స్వాతంత్ర పోరాటం, అమరజీవులు త్యాగం స్మరించుకోవాలని ఆయన అన్నారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అయ్యేందుకు సిద్ధం కావాలన్నారు. తొలుత ఇన్‌చార్జి ఎంపీడీఓ వై సుజాత, ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, మల్కాపురం సర్పంచ్ పత్యాల సునీత, ఎంఎస్ఆర్ఈజీఎస్ ఏపీఓ కిషోర్, నోడల్ ఆఫీసర్ పార్వతి, ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మీ, ఏపీడీ సుధాకర్, ప్లాంటేషన్ మేనేజర్ వంకట లక్ష్మీ తదితరులు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి వెలిగించి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. పాఠశాల పిల్లలు వందేమాతరం ఆలపించారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం స్థానిక సంఘం జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. యూనియన్ పతాకాన్ని యూటీఎఫ్ పూర్వపు జిల్లా కోశాధికారి, విశ్రాంత ఉపాధ్యాయుడు జీవీ సూరపరాజు ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు తొలినాళ్లల్లో సంఘం అవసరత చాలా ఉండేదని, నేడూ అదే పరిస్థితి కనపడుతోందని ఆయన అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్, అధ్యక్షుడు ముస్తఫాలీ, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి తదితరులు మాట్లాడారు.

ఇద్దరికి గాయాలు

గణపవరం: గణపవరం – పిప్పర – తాడేపల్లిగూడెం రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. తాడేపల్లిగూడెంకు చెందిన గుర్రం ఉదయ్‌కిరణ్, అతని స్నేహితుడితో కలిసి మోటార్ సైకిల్‌పై పిప్పర వచ్చి, తిరిగి తాడేపల్లిగూడెం వెళ్తుండగా జల్లికొమ్మర తూము వద్ద పిప్పరవైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో గాయపడ్డ ఇద్దర్నీ 108 వాహనంలో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉదయకిరణ్ చేతివేళ్లు విరిగాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై వి.వెంకటేశ్వరావు తెలిపారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం



నులిపురుగుల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్: నులిపురుగుల నివారణతో పిల్లలు మరింత ఆరోగ్యంగా ఉంటారని కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. గురువారం స్థానిక అప్పలస్వామికాలనీలో నగర పాలక పాఠశాలలో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. నులిపురుగుల నివారణతో పిల్లలు శారీరక, మానసిక ఆరోగ్యవంతులవుతారని రాము అన్నారు. పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం పని చేస్తోందని వివరించారు. ప్రభుత్వ పాఠశాల పిల్లల కోసం ప్రభుత్వం అనేక పథకాలు రూపొందించి అమలు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, ఉపాధ్యాయులు కమలాసన్, రత్నాకర్, పాఠశాల మధ్యాహ్న భోజన ఇన్‌చార్జి డి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలను తెలుసుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్వాతంత్ర్య పోరాటంలో మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి విద్యార్థీ తెలుసుకోవాలని ఏలూరు సుబ్బమ్మ దేవి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.కుటుంబరావు అన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం తరఫున ఈ నెల 9 నుంచి 15 వరకు విద్యాలయాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా 12వ తేదీ పోటీల ఫ్లెక్సీని గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఈ నెల 9, 10, 11, తేదీల్లో హైస్కూల్, కాలేజీల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 12న హైస్కూల్ విద్యార్థులకు ఉపన్యాస, కాలేజీ విద్యార్థులకు క్విజ్ పోటీలు సుబ్బమ్మ దేవి హైస్కూల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీలకు హైస్కూల్ నుంచి ముగ్గురు చొప్పున, కాలేజీ నుంచి గ్రూపుకు ముగ్గురు చొప్పున రెండు గ్రూపులు పాల్గొనవచ్చని చెప్పారు. విజేతలకు 15వ తేదీన నగరంలోని సీతారామ్ భర్తియా కళ్యాణ మండపంలో నిర్వహించే సభలో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యురాలు జి.శారద, ఉపాధ్యాయులు ఆర్వీఆర్‌కే వరప్రసాద్, కె.శ్వేత, ఎస్.లీలా కుమారి, పి.గోపాల్ పాల్గొన్నారు. కాగా, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల లైబ్రేరియన్ జ్యోతి మాట్లాడుతూ కాలేజీ విద్యార్థులకు స్వాతంత్ర్య పోరాట ఆశయాలు భారత రాజ్యాంగం గురించి తెలుసుకోవడానికి ప్రోత్సహించేలా వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఈ పోటీల ముగింపు ఉత్సవాల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఇవ్వదలచిన విద్యార్థులు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని కోరారు.



పోటీల వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం

గణపవరం: వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు సంతోష్, కిరణ్మయి అన్నారు. చేతుల పరిశుభ్రత అంటువ్యాధుల వ్యాప్తిపై గురువారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, మలవిసర్జన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. చేతులు, గోళ్ల ద్వారా కంటికి కనిపించని సూక్ష్మ క్రిములు శరీరంలోకి ప్రవేశించి, అనారోగ్యం బారిన పడతామని చెప్పారు. ఆరోగ్యకరమైన అలవాట్లు నేర్చుకోవాలని సూచించారు. చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జాలాది విల్సన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గణపవరం హైస్కూల్లో చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

చిన్నారికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

దెందులూరు: మేధినరావుపాలెంలోని మొండూరు గ్రామానికి చెందిన డయాలసిస్ చికిత్స పొందుతున్న చిన్నారి బొంత దుర్గా మౌనికరే వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1 లక్ష సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అందజేశారు. మౌనిక తల్లి వెంకటలక్ష్మీ తన కిడ్నీని కుమార్తెకు దానం చేసేందుకు అంగీకరించింది. దుర్గా మౌనిక పరిస్థితిని ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు ఎమ్మెల్యే చెప్పారు. వెంటనే స్పందించిన సీఎం రూ.లక్ష విడుదల చేశారని, ఈ మేరకు చెక్కును దుర్గా మౌనికకు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో అందజేశామన్నారు. తల్లి వెంకటలక్ష్మి ప్రేమను గ్రామస్తులు, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అభినందించారు.



మొండూరులో మౌనికకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

జూదరుల అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ పరిధి సుంకరవారి తోటలో పేకాటశిబిరంపై పోలీసులు దాడి చేసి జూదరులను అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్, ఎస్సై రామకృష్ణలకు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు రూరల్ ఎస్సై ఎస్.లక్ష్మణబాబు కేసు దర్యాప్తు చేపట్టారు.

పట్టణాభివృద్ధికి పనిచేద్దాం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణ అభివృద్ధికి పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పని చేద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అలాగే ప్రజాసహకారం ఎంతో అవసరం అన్నారు. సమావేశంలో కౌన్సిల్ సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వైస్ చైర్మన్ ముప్పిడి అంజి మాట్లాడుతూ పామాయిల్ కర్మాగారం నుంచి వ్యర్థాలు పట్టణంలో ప్రవేశించడం వల్ల భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయన్నారు. దీంతో మంచినీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. అలాగే పలువురు సభ్యులు కూడా పామాయిల్ వ్యర్థాలపై ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ పి.భవానీ ప్రసాద్ మాట్లాడుతూ పామాయిల్ కర్మాగారం వ్యర్థాలపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు రాశామని చెప్పారు. అలాగే త్వరలోనే పన్నులపై సమీక్షిస్తామన్నారు. 19వ వార్డు సభ్యురాలు ప్రియదర్శిని మాట్లాడుతూ తన వార్డులో పాఠశాలకు సమీపంలో వినియోగంలో లేని ఓపెన్ బోర్లు ఉన్నాయని, ఆ బోర్లను శాశ్వతంగా మూసివేయాలని గత సమావేశంలో కోరినప్పటికీ నేటికీ చర్యలు తీసుకోలేదని నిలదీశారు. దీంతో ఏఈ సంధ్య మాట్లాడుతూ వెంటనే శాశ్వతంగా ఓపెన్ బోర్లను మూసివేస్తామన్నారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో సాధారణ నిధులు రూ.3.09 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మించాలని సమావేశం తీర్మానించింది. ఫిష్ ఆంధ్ర హబ్‌కు మున్సిపల్ అధీనంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా 2 సెంట్ల స్థలాన్ని లీజుకు ఇచ్చేందుకు, 29వ వార్డులో డ్వాక్రా మల్టీపర్పస్ హాల్ ఆధునికీకరణకు రూ.10 లక్షల నిధులు కేటాయింపు అంశాలను ఆమోదించింది. అలాగే 21, 22, 23, 24 వార్డుల పరిధిలోని సాలిపేట రోడ్డు నిర్మాణానికి రూ. 70 లక్షలతో టెండర్లు ఖరారు చేశారు. 9వ వార్డు బాట గంగానమ్మ లేఅవుట్ కాలనీ వద్ద రూ.నాలుగు లక్షల వ్యయంతో మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని, 9వ వార్డు సాయి బాలాజీ నగర్‌లో వెట్ మిక్స్ రోడ్ వేసేందుకు రూ.5 లక్షల నిధులు కేటాయిస్తూ తీర్మానించారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

వార్డులు ఆరు.. నామినేషన్లు ఎనిమిది

పాతముప్పర్రు మినహా వార్డులకు పోటీ లేదు

పెదపాడు : మండలంలోని వీరమ్మకుంట సర్పంచ్ ఉప ఎన్నికలకు గురువారం 9 నామినేషన్లు దాఖలు కాగా 6 వార్డులకు 8 నామినేషన్లు దాఖలయ్యాయి. సర్పంచ్ ఉపఎన్నికకు వైఎస్సార్‌సీపీ నుంచి నలుగురు, టీడీపీ నుంచి ఐదుగురు నామినేషన్ దాఖలు చేశారు. పెదపాడు మండలంలో ఖాళీ అయిన ఆరు వార్డుల్లో 5 వార్డులో పోటీ లేదు. పెదపాడు 8వ వార్డుకు ఒక నామినేషన్, రాజుపేటలోని 1, 4 వార్డులకు ఒక్కొక్కటి, అప్పనవీడు 7వ వార్డుకు రెండు, పాతముప్పర్రు 10వ వార్డుకు బురద సోమేశ్వరి, ముదురుమాక అన్నమ్మలు నామినేషన్లు వేశారు. వసంతవాడ 9వ వార్డుకు ఒకటి, అప్పనవీడు 7వ వార్డు ఎస్సీలకు కేటాయించడంతో బట్టు స్వరూపరాణి, ప్రత్తిపాటి కరుణ కుమారి నామినేషన్ దాఖలు చేశారు. వీరిద్దర్నీ వైఎస్సార్‌సీపీ బలపర్చడంతో ఎన్నిక ఏకగ్రీవం కానుంది. కార్యక్రమంలో దెందులూరు ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్, సర్పంచ్ చిన్నాల ఝాన్సీ పాల్గొన్నారు. పెదపాడులో వైఎస్సార్‌సీపీ బలపరిచిన గిన్నిపల్లి సోమేశ్వరమ్మ, రాజపేటలో 1వ వార్డుకు తలారి వనజ, 4వ వార్డుకు వడ్లమూడి మరియమ్మ, వసంతవాడ 9వ వార్డుకు చింతల ఆనంద్ నామినేషన్ దాఖలు చేశారు. 4 వార్డులకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది.

వార్డులు మూడు.. నామినేషన్లు ఎనిమిది

ఉంగుటూరు: ఉంగుటూరు, కాకర్లమూడి వార్డులకు ఎన్నికల కోలాహలం మొదలైంది. వార్డు సభ్యుల నామినేషన్లు గడవు గురువారం ముగిసింది. ఉంగుటూరు 10వ వార్డుకి కాళ్ల నాగలక్ష్మి, తుంగ అనూష, మారిశెట్టి సరస్వతి, ముప్పన రాధిక, కాకర్లమూడి 1వ వార్డుకి రాజాని వరలక్ష్మి, రాయి నాగమణి, 5వ వార్డుకి గోడె రాజు, తోట దివాకర్‌లు నామినేషన్లు వేశారు. కాగా 14న విత్‌డ్రాలకు అవకాశం ఉంది. ఆయా గ్రామ పంచాయతీ సెక్రటరీలు సహకరిస్తుండగా, కాకర్లమూడి ఎన్నికల అధికారిగా కె.ప్రవీణ్‌కుమార్, ఉంగుటూరు ఎన్నికల అధికారిగా సుబ్రహ్మణ్యం పనిచేస్తున్నారు.



అప్పనవీడులో నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు

వార్డు మెంబర్లకు 15 నామినేషన్లు

దెందులూరు: మండలంలో వార్డు మెంబర్ల ఎన్నికలకు 15 నామినేషన్లు గురువారం దాఖలయ్యాయి. కొత్తగూడెం గ్రామంలో 5వ వార్డుకు ఐదు, 11వ వార్డుకు నాలుగు నామినేషన్లు దాఖలు చేశారు. కొవ్వలిలో 11వ వార్డుకు రెండు, గోపన్నపాలెంలో 11వ వార్డుకు నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి.

నామినేషన్ల ఘట్టం పూర్తి

భీమడోలు: పోలసానిపల్లిలోని 12వ వార్డు ఉప ఎన్నికకు గురువారం సాయంత్రంతో నామినేషన్ల ఘట్టం ముగిసింది. మొత్తం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయని స్టేజ్ వన్ అధికారిణి జీవన సంధ్య తెలిపారు. ఈనెల 11న నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	80	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	48	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	56	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05-07
బెండకాయలు	30	కంద	40
పచ్చిమిర్చి	58	బీట్‌రూట్	36
కాకర కాయలు	54-60	కీరా దోస	36
బీరకాయలు	38	ఫ్రెంచ్‌బీన్స్	90
బీరకాయలు (పందిరి)	44	అల్లం	150-240
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	17
క్యారెట్	36	పాలకూర	15
దొండకాయలు	34	చుక్కకూర	15
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	25	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	36 - 44	బఠాణి	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	25 -25	చిలకడదుంప	36

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	35
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	23
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	10

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	17
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	25
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	13
ఏలూరు –బీహెచ్ఈఎల్	08.00	4794	రద్దు
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	30
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	రద్దు
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	రద్దు
ఏలూరు –తిరుపతి	16.00	4830	15

పీడీఎస్ బియ్యం స్వాధీనం

కొయ్యలగూడెం : పొంగుటూరు గ్రామంలోని ఓ నివాసంలో అక్రమంగా నిలువ చేసి ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ టి.శ్రీనివాస్ గురువారం పేర్కొన్నారు. కన్నాయిగూడెం రోడ్డులో నివాసం ఉంటున్న బూరుగు వెంకటేశ్వరరావుకి చెందిన కిరాణా జనరల్ స్టోర్‌లో మూడు క్వింటాళ్ల బియ్యం అక్రమ నిల్వలను గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. పట్టుకున్న బియ్యం విలువ రూ.5400 వరకు ఉంటుందని అన్నారు. పి.ఏసుబాబు, గ్రామ రెవెన్యూ అధికారి, సీహెచ్ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలాలు

భీమడోలు: స్థానిక బాదర్వాడ కృష్ణ మోహనరాజు పెరట్లో బ్రహ్మ కమల పుష్పాలు వికసించి చూపరులను కనువిందు చేశాయి. ఒక మొక్కకు బుధవారం అర్ధరాత్రి ఒంటి గంటకు ఒకేసారి ఏడు పుష్పాలు వికసించాయి. సాధారణంగా వేసవిలో బ్రహ్మకమలాలు వికసిస్తాయి. మూడు నెలల ఆలస్యంగా పుష్పించాయని ఇంటి యాజమాని తెలిపారు. ఈ మొక్కను కింగ్ ఆఫ్ హిమాలయన్ ఫ్లవర్‌గా పిలుస్తారు. ఈ మొక్కపై ఆకులే పువ్వుగా రూపాంతరం చెందుతాయి. చెట్టు నుంచి ఒకేసారి ఏడు పువ్వులు వికసించడం అరుదుగా ఉండడంతో చూపరులు ఆసక్తిగా తిలకించారు.



భీమడోలులో వికసించిన బ్రహ్మకమలాలు

వైఎస్సార్‌సీపీలోకి పలువురి చేరిక



చొదిమెళ్ల రవిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: సోమవరప్పాడు గ్రామానికి చెందిన టీడీపీ నేత చొదిమెళ్ల రవి గురువారం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవరప్పాడులో రవిరి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కండువాను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధి, బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, పెదవేగి ఎంపీపీ తాతా రమ్య రవిని అభినందించారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

భీమడోలు: ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తే వారు ఉన్నత స్థితికి చేరుకుంటారని వక్తలు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూలులో పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు గురువారం ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కఠారి కోరుకొండ నాగేశ్వర నరసింహమూర్తి (కోరు మాస్టార్) స్మృత్యర్థం ఆయన కుమారులు పుణ్యమూర్తి, సుబ్రహ్మణ్యం వాటిని అందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన కె.రితిక, ఎల్.వినూత్న, వెజ్జు పవన్‌లకు రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు చొప్పున నగదు, షీల్డ్‌లను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.